# మందు కందని రోగం

ఒక పెద్ద ట్రాన్స్‌పోర్టు కంపెనీలో రీజనల్ మేనేజర్ హెూదాలో – తన గదిలో కూర్చుని ఏవో ముఖ్యమైన కాగితాలు చూసుకుంటున్నాడు సుందరం. ఇంతలో ప్యూను విజిటింగ్ కార్డు తీసుకుని లోపలికొచ్చాడు.

'వెంకటప్పయ్య' అని చూసి

'రమ్మను' అన్నాడు.

తలుపు తోసుకుని లోపలికొచ్చిన వ్యక్తి "ఒరే సుందరం" అంటూ పరుగులాంటి నడకతో సమీపిస్తుంటే, సుందరం మస్తిష్కంలో వేగంగా తిరిగిన సినిమా రీలులో కలగాపులగంగా ఏవో జ్ఞాపకాలు – ఎన్నో రూపాలు. అందులో ఈ వెంకటప్పయ్య సన్నగా, తెల్లగా, నాజూకుగా వుండే రూపం గుర్తొచ్చింది. అంతలోనే ఆనందం, ఆశ్చర్యం. ఎక్కడో గుండెలో గుబగుబలాడిన కృతజ్ఞత తాలూకు స్పందన ఒక్క క్షణం అతన్ని ఊపేసాయి. నిజానికి సుందరం వెంకటప్పయ్యని ఎప్పుడూ మర్చిపోకపోయినా, ఇప్పటతని రూపాన్ని చూసి గుర్తుపట్టడం కొంచెం కష్టమైంది.

సుందరం సీట్లోంచి లేచి వెంకట్పయ్యని కౌగిలించుకున్నాడు –

"చాలా మారిపోయావురా" అంటుంటే సుందరం గొంతు గాద్గదికమైంది.

ఇంక ఒక్క క్షణం కూడా విశ్రాంతి ఇవ్వకుండా వెంకటప్పయ్య మాట్లాడటం మొదలు పెట్టాడు.

"ఒరే సుందరం! ఎలా వున్నావురా! ఎలా వుంటావులే పాతికేళ్ళ వయసు కూడా లేనప్పుడు విడిపోయిన మనం ఏభైకాకపోయినా నలభైఅయిదు దాటాక కలుసుకున్నాం.

అప్పుడున్న ఉత్సాహం ఆరోగ్యం ఇప్పుడెలా వుంటాయి. అఫ్‌కోర్స్! డబ్బు సంపాదించ వచ్చు. హోదా పెరగవచ్చు - పలుకుబడి వుండవచ్చు. కానీ పోయిన వయసూ ఆరోగ్యం ఎలా వస్తాయి? ముఖ్యంగా ఆరోగ్యం అనేది చాలా గొప్ప విషయం. అది మన చేతుల్లో వున్నది కాదు. సుందూ! నాకప్పుడే ఒకసారి మైల్డ్ హార్ట్ ఎటాక్ వచ్చింది. బి.పి. సరేసరి డాక్టరు చేతుల్లో పడకుండానే వుండాలి గాని పడ్డామంటే చాలు రెస్టు రెస్టు - మందులు మందులు - అబ్బబ్బ భలే విసుగనుకో -"

సుందరం మరేం మాట్లాడలేకపోయాడు. ఇన్నేళ్ళు అమెరికాలో వున్నా ఆనాడెలా మాట్లాడుతున్నాడో ఇప్పుడూ అలాగే వున్నాడు అనుకుంటూ వుండిపోయాడు - అయినా వెంకటప్పయ్య ప్రశ్నలడగడం - తనే జవాబు చెప్పడం - సుందరం మాట్లాడేందుకు అవకాశమే లేదు.

"నీ దిప్పుడు చాలా పెద్ద పొజిషన్ కదూ" అన్నాడు వెంకటప్పయ్య.

"బాధ్యతలెక్కువ" అన్నాడు సుందరం.

"చెల్లాయెలా వుంది? నలభై దాటి వుంటాయి కదా ఆమెకిప్పుడు. అబ్బబ్బ! మా ఆవిడకి బి.పి. షుగర్ వుంది. ఉండుండి గుండెదడ పాల్పిటేషన్ వచ్చి మహా హడావుడి చేసేస్తుంటుంది. పెళ్ళికి నువ్వొచ్చావుగా ఎలా వుండేదో గుర్తుందా? సన్నగా తెల్లగా. అలాంటిదిప్పుడు విపరీతంగా లావెక్కిపోయింది" అని కాస్సేపాగి -

"చెల్లాయి బాగుందా" అన్నాడు.

"ఆ... బాగానే వుంది" అన్నాడు సుందరం చిన్నగా నవ్వుతూ - వెంకటప్పయ్య మాటల వెనుక వున్న బాధ, కాంప్లెక్స్ అర్థం చేసుకోవటానికి ప్రయత్నం మొదలు పెట్టాడు-

నిజానికి వెంకటప్పయ్య మాట్లాడిన ప్రతి మాటనీ ఖండించాలి. కానీ తనకా శక్తి లేదు? సుమారు పాతిక సంవత్సరాల తర్వాత కలుసుకున్న ప్రాణస్నేహితుడు. తన జీవితానికి పూలబాట వెయ్యటానికి విత్తనాలు జల్లి , నిస్వార్థంగా తనని ప్రేమించిన తన మిత్రుడు. అతనేం మాట్లాడినా ఖండించి అతన్ని బాధించటం తనకిష్టం లేదు.

అందుకే సుందరం ఎక్కువగా ఏమీ మాట్లాడలేదు. అతనన్నది కాదని తాను పొందేదేమీ లేదు.

"ఇంటికెళ్దాం - వెంకన్నా - నిన్ను చూస్తే మీ చెల్లాయి చాలా ఆనందిస్తుంది" అన్నాడు సుందరం.

"నాకేం అభ్యంతరం లేదు. నాకూ చూడాలనే వుంది. కానీ ఇంటిదగ్గర హడావిడి పెట్టకు. ఆమె ఆరోగ్యం ఎలా వుంటుందో ఏమో" సుందరం వెంటనే "మరేం ఫరవాలేదు" అన్నా వినిపించుకోకుండా

"నిజానికి ఆడవాళ్ళ రోగాలు చెప్పలేం. మా యింట్లో ఎప్పుడూ ఒక వంటమనిషి – ఒక పై మనిషి వుంటే తప్ప నాకు కంచంలో మెతుకులు రావు, కప్పు కాఫీ రాదు" అన్నాడు.

సుందరం మరేం చెప్పలేక "మరేం ఫర్వాలేదు. నడు వెళ్దాం – అంత మరీ శ్రమపడి నీకోసమేం చెయ్యదులే " అన్నాడు.

"ఏం ఆమెకీ నీరసం కదూ! కరెక్ట్! నేను గ్రహించగలను అన్నాడు వెంకటప్పయ్య సుందరం కళ్ళల్లోకి సూటిగా చూస్తూ –

" ఏదో వుంటూనే వుంటాయి అలాంటివి" అన్నాడు ఎటూ చెప్పలేక. పక్కనే వున్న ఫోను తీసి రింగ్ చేశాడు. అటునుంచి సుజాత "హల్లో" అంది.

"ఆ... నేను మాట్లాడుతున్నాను. మా ఫ్రెండ్ వెంకటప్పయ్య పాతికేళ్ళ తర్వాత మన ఇల్లు పావనం చేయబోతున్నాడు" అన్నాడు.

"అమెరికా నుంచి వచ్చారు కదూ" అందామె.

"అవును"

"మీ రెప్పుడూ చెప్తుంటారుగా?"

"అవును అతనే. అయితే నువ్వు మరీ శ్రమపడి ఏమీ చెయ్యొద్దు. వాడు మనవాడే. మరేం అనుకోడు" అన్నాడు సుందరం.

సుజాత గతుక్కుమంది. మాట్లాడుతున్నది సుందరమేనా – తన భర్తేనా – ఇలా మాట్లాడుతున్నారేమిటి? అసలు తనకేమైందనీ – ఇన్ని ఆలోచించినా మరేమీ సమాధానం చెప్పలేదు.

"అదేంటి? నాకు శ్రమా? బాగుంది మీ వరస. రాక రాక ఇన్నేళ్ళ తర్వాత వస్తే" అంది. ఆ గొంతులో తెలీకుండానే కోపం తొంగిచూసింది –

సుందరం సన్నగా నవ్వి "సర్లే" అన్నాడు.

"ఇంతకీ మీ రెన్ని గంటల కొస్తున్నారు?" అంది. "ఇద్దరం మూడున్నరకి" అంటూ ఫోను పెట్టేశాడు.

సుజాత ఇల్లంతా నీటుగా సర్దుకుని ఆ సమయానికి సిద్ధంగా వుంటుందని అతనికి తెలుసు.

వెంకటప్పయ్య సుందరం కలిసి చదువుకున్నారు. సుందరం బి.ఏ. రెండవ సంవత్సరంలో వుండగా అతని తండ్రి పోవడంతో సంసారం కష్టాల పాలైంది. అతని చదువు ఆగిపోయే తరుణంలో వెంకటప్పయ్య తండ్రిని ఒప్పించి రెండు సంవత్సరాలు డబ్బు ఇప్పించాడు. మొత్తం లెక్కలు కట్టి సుందరం ఉద్యోగం రాగానే ఇచ్చేసినా ఆనాటి ఆ సమయాన్ని, గడిచిన ఆ కాలాన్ని తిరిగి ఇవ్వలేదు గనుక ఆ సహాయానికి సుందరం కృతజ్ఞత స్థిరంగా వుండిపోయింది.

ఆ తర్వాత సుందరం క్రమంగా పైకి వచ్చాడు. వెంకటప్పయ్య పెద్దన్నయ్య అమెరికాలో వుండడం వల్ల అతనూ అమెరికాలోనే స్థిరపడిపోయాడు – అతనికి అనారోగ్యం జీవితంలో ఒక భాగమైపోయింది. చాలామంది ఆరోగ్యంగానే వుంటారనే దానికంటే అతనికి అంతా రోగిష్టులే వుంటారనే దృఢమైన అభిప్రాయం ఏర్పడి పోయింది. అతనెవర్ని చూసినా అదే దృష్టితో చూస్తాడు.

వెంకటప్పయ్య మానసిక స్థితి సుందరం త్వరలోనే అర్థం చేసుకున్నాడు.

ఇద్దరూ ఇల్లు చేరేసరికి ఇల్లంతా నీటుగా అద్దంలా వుంది. అప్పుడే విరిసిన నందివర్ధనం పువ్వులా సుజాత మిలమిల మెరుస్తోంది. నిజానికి ఆ క్షణంలో ఆమె వయస్సు ఖచ్చితంగా చెప్పడం ఎవరికైనా కష్టమే.

పరిచయాలయ్యాక వెంకటప్పయ్య ఆగలేక అనేశాడు. "మీ ఆవిడ లోపల అనారోగ్యం ఎలా వున్నా పైకి అయినా చక్కగా కనిపిస్తుంది. మా ఆవిడదీ లేదు ఎప్పుడూ మంచం మహారాణియే" అన్నాడు.

సుజాతకేమీ అర్థం కాలేదు. అయోమయంగా చూసింది. ఏం సమాధానం చెప్పాలో – ఎలా చెప్పాలో తెలీక నిశ్శబ్దంగా వుండిపోయింది. చిరునవ్వు ముఖాన పులుముకుని.

"నిజమే కొంతలో కొంత నయం" అన్నాడు సుందరం. ఈ మాటలకి మాత్రం సుజాతకి చర్రున కోపమొచ్చింది. భర్తవైపు చుర చుర చూసింది. సుందరం అదేం పట్టించుకోకుండా వెంకటప్పయ్యతో మాటల్లో పడిపోయాడు.

వచ్చిన అతిథికోసం ఎనిమిది రకాలు వంటకాలు చేసింది.

అన్నీ చూసి వెంకటప్పయ్య ఆనందపడిపోతూ, ఆందోళన పడిపోవడం మొదలుపెట్టాడు.

"ఇదిగో చెల్లాయ్! ఇలా వొళ్ళు విరుచుకుని ఇన్ని చెయ్యవద్దని నేను నీకు ముందే చెప్పమన్నాను. మా వాడు వినలేదన్న మాట. ఒక రోజు చేసి పదిరోజులు పడుకుంటే ఏం లాభమమ్మా" అన్నాడు.

ఈ మందలింపుకి సుజాతకి కళ్ళనీళ్ళ పర్యంతమైంది. ఎలాగో నిగ్రహించుకుని "నా కలాంటిదేమీ లేదండి" అంది వినయంగా.

"భలే అన్నావు. అచ్చం మా ఆవిడ కూడా ఇలాగే అంటుంది" అన్నాడు.

సుజాత నిస్సహాయంగా వూరుకుంది.

రాత్రి తొమ్మిదింటికి వెంకటప్పయ్యను కారులో సాగనంపడానికి బయలుదేరాడు సుందరం.

"నేనూ రానా" అంది సుజాత – ఎవరేనా వస్తే అలా ఇద్దరూ కలిసి వెళ్ళి దిగబెట్టి రావడం అలవాటే. అందుకే అడిగింది.

సుందరం ఏమనుకున్నాడో – ఏమో –

"వద్దు సుజా! చలిగాలి ఎక్కువగా వుంది. నీకు పడకపోతే కష్టం. మళ్ళీ రెండు మూడు రోజులు పడకేస్తావు. అసలే నీ ఆరోగ్యం మంచిది కాదు" అన్నాడు సుందరం.

ఈ మాటలు పూర్తిగా విన్న వెంకటప్పయ్య ముఖం చింకి చేటంటయింది. ఎంతో సంతృప్తి అతని ముఖంలో స్పష్టంగా కనిపించింది.

"శభాష్! బాగా చెప్పావు. ఆరోగ్యం చాలా ముఖ్యం. ఇలాంటి ఫార్మాలటీస్ కాదు కావలసింది. చూశావా! అనారోగ్యం లోపల పెట్టుకుని కూడా పైకి గంభీరంగా తిరుగుతారు. అంతా వెళ్ళాక మనని పట్టుకుని బాధిస్తారు" అన్నాడు.

సుజాత కళ్ళనీళ్ళ పర్యంతమైంది – ఆమె కింతవరకు కనీసం నాలుగు రోజులు జ్వరం వచ్చి కూడా ఎరుగదు. ఇద్దరూ కారెక్కే వరకు సభ్యతకోసం నిలబడి లోపలికెళ్ళి మంచంమీద వాలిపోయింది. ఎక్కడిదో ఏడుపు కట్టలు తెంచుకు నొచ్చేసింది – అలాగే నిద్రలోకి జారుకుంది.

అర్ధరాత్రి పక్కన వున్న భర్త చెయ్యి ప్రేమగా తనమీద పడితే మెలకువ వచ్చింది. ఆరోజు జరిగిందంతా జ్ఞాపక మొచ్చింది.

సుందరం కేసి తిరిగింది. అతను నిద్రపోవడంలేదు. ఆమె భర్తవైపు తదేకంగా చూస్తూ వుండిపోయింది.

"నీకు చాలా కష్టం కలిగించాను కదూ సుజీ! నిజమే. నా ప్రాణస్నేహితుడు నా యీ జీవితానికి కారకుడైన వెంకటప్పయ్యకోసం అలా అన్నాను.

వాడొక చిత్రమైన రోగంతో బాధపడుతున్నాడు. వాడి భార్య రోగిష్టిది. వాడు రోగిష్టివాడు. అంతా అలాగే వుంటారని అభిప్రాయం. వుండాలని వాడి అంతరాంతరాలలో కోరిక –

ఉన్నంతసేపూ రోగాల గురించి ఎంక్వయిరీతోనే సరిపోయింది. నన్ను ఒక మాట మాట్లాడనీయలేదు – పొద్దుటనుండి గ్రహించాను.

అయితే, అన్నీ తనే చెప్పాడు. తనే ప్రశ్నలు వేసి జవాబులు చెప్పుకున్నాడు. వాడు నా నుండి అదే ఆశిస్తున్నాడు అని అర్థమైంది. నువ్వూ నేనూ కూడా ఏమంత ఆరోగ్యంగా లేమని నిర్ధారణ చేస్తే వాడి కానందం – తృప్తి. అందుకే...."

సుజాత ఆశ్చర్యంగా చూస్తోంది భర్తని.

అతను కొంటెగా నవ్వి "నా కెన్ని రోగాలు వున్నాయో తెలుసా. బి.పి. వుందీ... షుగర్ వుందీ... ఇంకా" భర్త నోరు సున్నితంగా మూసి అతన్ని గట్టిగా కౌగిలించుకుంది. తన గుండెల్లో దూరిపోయిన భార్యని ప్రేమగా తల నిమిరి "పిచ్చి సుజీ" అన్నాడు సుందరం.